సివిల్స్ టాపర్‌ను అభినందించిన కలెక్టరు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సివిల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ర్యాంకు సాధించిన డాక్టరు జివిఎస్ పవన్‌దత్తాను కలెక్టరు కె.వెంకటరమణారెడ్డి సత్కరించారు. కలెక్టరేట్ వద్ద కలెక్టరును మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చిన పవన్ దత్తాను వెంకటరమణారెడ్డి దుశ్శాలువతో, పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ తిరుపతి ఎస్‌వి మెడికల్ కళాశాలలో 2014 బ్యాచ్ ద్వారా డాక్టర్ పట్టాని పొందిన పవన్ దత్తా సివిల్స్‌లో టాప్‌ర్యాంకర్‌గా నిలవడం, ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ర్యాంకును సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ సిఈవో మురళీకృష్ణ, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు వై.ప్రవీణ్, పవన్ దత్తా తల్లిదండ్రులు లలితకుమారి, వెంకటేశ్వర్లు, కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, రాధాకృష్ణవర్మ పాల్గొన్నారు.

సిఫార్సు బది'లీ(ల)లు'..?

ప్రజాప్రతినిధుల వద్ద ఉద్యోగుల క్యూ

పోస్టు ప్రాధాన్యతను బట్టి బేరసారాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'మీరు కోరుకున్న చోటుకు బదిలీ కావాలా.. ఆ మంత్రి, ఎంఎల్ఎ, ఆ ప్రజాప్రతినిధి మనవాళ్లే..మనం ఎంత చెబితే అంత.. మీకెందుకు నిశ్చింతగా ఉండండి..' అంటూ పీఏలు, ఆఫీసు బేరర్లు, కొంతమంది యూనియన్ నాయకులు పైరవీలకు తెరలేపారు.. కోరుకునే దూరాన్ని బట్టి బేరసారాలు జరుగుతున్నాయి. ఉద్యోగులు, అధికారుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో పైరవీలు ఊపందుకున్నాయి. సిఫార్సు లేఖలతో ప్రజాప్రతినిధుల వద్ద క్యూ కడుతున్నారు. నాలుగేళ్ల తర్వాత ఉద్యోగులకు పెద్దఎత్తున బదిలీ చేసేందుకు ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. గత నాలుగేళ్లుగా తిరుపతి కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు తమ పోస్టులను పదిలం చేసుకునేందుకు రాజకీయ పైరవీలు సాగిస్తున్నట్లు సమాచారం. ఒక్క తిరుపతి నగరంలోనే దాదాపు 25 మందిపైగా దీర్ఘకాలికంగా తిష్టవేసుకున్నట్లు తెలుస్తోంది.

సిఫార్సు ఉంటే సరి. చిరుద్యోగి నుంచి అధికారి వరకూ కోరుకున్న చోటకు వెళ్లొచ్చని పెద్దఎత్తున ప్రచారం నడుస్తోంది. జిల్లాలో అత్యధికంగా జిల్లాపరిషత్, తహశీల్దార్ కార్యాలయాల్లో రాజకీయ నేతల సిఫార్సులు ఉండే అవకాశం ఉంది. ఆఫీసు బేరర్ల ముసుగులో బదిలీలు ముందుకొచ్చిన ప్రతిసారీ కొందరు ఉద్యోగులు యూనియన్ నాయకుల పేరుతోనో, స్పౌజ్ కేసుల వంకతోనో బదిలీల నుంచి తప్పించుకుంటున్నారు. అలా ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో పాతుకుపోయిన ఉద్యోగులు చాలా మంది ఉన్నారు. అటువంటి వారు సైతం మరోసారి బదిలీని ఆపుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కొందరు పలుకుబడి ఉన్నవారు గుర్తింపు సంఘాల్లోని ఆఫీసు బేరర్లుగా పని ధృవీకరణ పత్రాలు తెచ్చుకునే పనిలో ఉండటం గమనార్హం. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో నగదు చేతులు మారుతోందని బహిరంగంగానే విమర్శలు ఉన్నాయి. యూనియన్ నాయకుల పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించేవారిపై అధికారులు దృష్టి సారించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

నిబంధనలివి..!

దీర్ఘకాలికంగా ఒకేచోట ఉన్న ఉద్యోగులకు స్థానచలనం తప్పనిసరి అని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధంగానే ఉమ్మడి చిత్తూరు బదిలీలు జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 30 తేదీ నాటికి కనీసం రెండేళ్లు ఒకే ప్రాంతంలో పనిచేసిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా నిర్ణయించారు. ఒకచోట కనీసం ఐదేళ్లు ఉన్న ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ చేయాల్సిందే .ఇలా రెండు రకాల జాబితా సిద్ధం చేయాల్సి ఉంది .610 జీవో ప్రకారం గత ఏడాది జిల్లాకు కేటాయించిన ఉద్యోగులకు స్థానికత ఆధారంగా బదిలీలు జరగలేదు. జిల్లాలో పునర్విభజన తర్వాత తొలిసారి సాధారణ బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2లక్షల 3వేల మంది ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశం ఉందని సమాచారం. గ్రామ వార్డు సచివాలయ పరిధిలో పనిచేసే ఉద్యోగులు మాత్రం ఈ జీవో వర్తించదు.

మహానాడు వేదికగా..

టిడిపి గూటికి ఆనం, ఎస్సీవీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని బూర్జువా పార్టీలను చూస్తే అర్ధమవుతుంది. వలస రాజకీయ నాయకులను చేర్చుకోవడం ఆ పార్టీలకు అలవాటు. ఇటీవల జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రాంనారాయణరెడ్డిని అధిష్టానం వైసిపి నుంచి సస్పెండ్ చేసింది. అధికారంలో ఉన్నప్పటికీ 'జగన్ మార్క్' రాజకీయం నచ్చక ఆనం అధికార వేదికలపైనే పార్టీ విధానాలను దుమ్మెత్తిపోస్తూ వచ్చారు. ఎవరైనా అడిగితే పార్టీ మనుగడ కోసమే చేస్తున్నానని అప్పట్లో చెప్పేవారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపిని ధిక్కరిస్తూ ఓటు వేశారు. ఈ నేపథ్యంలో ఆనం రాంనారాయణరెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు టిడిపి అధినేత గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రాజమండ్రిలో జరిగే టిడిపి మహానాడు వేదికగా ఆనం రాంనారాయణరెడ్డి 'సైకిల్' ఎక్కనున్నారు. అలాగే శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్ఎ ఎస్సీవీ నాయుడు సైతం

'పసుపు' కండువా కప్పుకోనున్నారు. తన పుట్టినరోజు పురస్కరించుకుని ఇటీవల బహిరంగంగానే తాను ఎంఎల్ఎగా పోటీ చేస్తానని ప్రకటించారు. తాజాగా విజయవాడలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడ్ని కలిసి వచ్చారు. మహానాడు సందర్భంగానే దాదాపు వందలాదిమందితో వెళ్లి టిడిపిలో చేరనున్నట్లు శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో చర్చ నడుస్తోంది.

'ఆ వంతెన'కు మోక్షమెప్పుడో..?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఏడాదిన్నర క్రితం కురిసిన భారీ వర్షాలకు జిల్లా అతలాకుతలమయ్యింది. రాయలచెరువు మరవపోయింది. కల్యాణిడ్యాం గేట్లు ఎత్తేయడంతో చిగురువాడ స్వర్ణముఖి నది వంతెన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. అప్పట్లో రెండు నెలల పాటు తిరుపతితో సంబంధాలు 11 మండలాల ప్రజలకు తెగిపోయాయి. చంద్రగిరి ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తాత్కాలికంగా రోడ్డు నిర్మాణం చేసి, వర్షాలు తగ్గిన వెంటనే యుద్ధప్రాతిపదికన వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఏడాదిన్నర పూర్తయినా హామీగానే మిగిలిపోయింది. ఏ చిన్నపాటి వర్షం వచ్చినా తాత్కాలికంగా వేసిన మార్గంలో వాహనాలకు ఇబ్బంది. రామచంద్రాపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం, జీడీనెల్లూరు, పెనుమూరు, పల్లిపట్టు, చిత్తూరు తదితర ప్రాంతాల్లో పల్లెలను కలిపే రోడ్డు ఇది. వర్షాలప్పుడు రెండు నెలల పాటు బస్సులను ఆపడంతో ఇదే అదనుగా భావించిన ఆర్టీసీ అధికారులు ఆరూట్‌లో

నష్టాలొస్తున్నాయన్న సాకుతో ఆరు బస్సు సర్వీసులను నిలిపేశారు. యనమలమంద, చెంచుగుడి, ఆళ్లమడుగు ప్రాంతాలకు బస్సు సర్వీసులు లేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇకనైనా అధికార పార్టీ నాయకులు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. యుద్ధప్రాతిపదికన శాశ్వతంగా చిగురువాడ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

24 గంటల్లో సైబర్ బాధితునికి న్యాయం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సైబర్‌క్రైం వల్ల ఇబ్బంది పడ్డ ఓ బాధితుడికి పోలీసులు వెనువెంటనే స్పందించి 24 గంటల్లో న్యాయం చేశారని జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రిటైర్డు ఫారెస్టు రేంజ్ అఫీసర్ హేమచంద్ర తిరుపతి ఎన్‌జీవో కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన యూనియన్ బ్యాంక్ అకౌంట్ క్రెడిట్ కార్డు నుంచి 90వేల రూపాయలు డెబెట్ అయింది. ఆందోళన చెందిన బాధితుడు అలిపిరి పోలీసులను ఆశ్రయించారు. వారు సూచన మేరకు సైబర్‌క్రైమ్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ ఆదేశాల మేరకు సిబ్బంది ఎన్‌సిఆర్‌పిలో ఫిర్యాదు చేసి, సంబంధించిన ఆఫీసర్స్‌తో మాట్లాడి బాధితుని డబ్బులు 75వేలు తిరిగి అతని యూనియన్ బ్యాంకు క్రెడిట్ కార్డులో జమ అయ్యేలా చేశారు.

ఆర్థిక క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఏ సంస్థ అభివృద్ధి చెందాలన్నా, నాణ్యతలో రాజీపడకుండా లక్ష్యాలను సాధించడానికి ఆర్థిక క్రమశిక్షణ అత్యంత ముఖ్యమన్నారు. గత మూడేళ్లలో ఎస్‌విబిసి ఈ ఘనత సాధించిందని టిటిడి ఈవో, ఎస్‌విబిసి ఎండి ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్‌విబిసి కార్యాలయంలో ఆ చానల్ ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఎస్‌విబిసి సిఈవో షణ్ముఖ్ కుమార్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ సిఈవో సమర్ధవంతంగా ఎస్‌విబిసి పరిపాలన, ఆర్థిక అంశాల్లోని లోపాలను అధిగమించారని చెప్పారు. ప్రతి ఉద్యోగి సంస్థను తమదిగా భావించి, దాని ప్రతిష్ట కోసం కృషి చేయాలని కోరారు. గత మూడు సంవత్సరాల నుంచి ఎస్‌విబిసి దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని ఆద్యాత్మిక చానల్లో అగ్రస్థానం ఉందన్నారు.

ఎస్‌విబిసిలో ప్రచారమయ్యే కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకొంటున్నాయని తెలిపారు. అదే సమయంలో కార్యక్రమాల నాణ్యతలో రాజీపడకుండా అందరు సమిష్టి కృషితో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విబిసి పరిపాలన, న్యూస్, ప్రొడక్షన్, సాంకేతిక, ఆర్థిక, ఇతర విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి -తిరుమల

హైదరాబాదుకు చెందిన భక్తుడు శ్రీనివాసులురెడ్డి టిటిడి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈవో క్యాంపు కార్యాలయంలో టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డికి ఈ మేరకు చెక్కును అందజేశారు.

స్విమ్స్‌కు రెండు వీల్‌చైర్లు వితరణ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

స్విమ్స్ ఆసుపత్రికి టిటిడి రిటైర్డు సూపరింటెండెంట్ బిజె.పరిమళ ఆమె తల్లి డి.చంద్రమ్మ జ్ఞాపకార్థం రెండు వీల్‌చైర్లను వితరణ చేసింది. శుక్రవారం స్విమ్స్‌కు చేరుకున్న ఆమె వీల్‌చైర్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు రామ్, ఆర్ఎంవో డాక్టరు కోటిరెడ్డిలకు అందజేసింది. ఈ సందర్భంగా వారు దాతను అభినందించారు.

ఈఎస్ఐ ప్రైవేటీకరణ ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'ఈఎస్ఐ' పథకాన్ని బలోపేతం చేయాలని, కార్మికులందరికీ ఈఎస్ఐ వర్తింపజేయాలని, ఈఎస్ఐ ప్రైవేటీకరణ ఆపాలని సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో వరదరాజనగర్ బ్రాంచి ఆఫీసు ఎదుట శుక్రవారం ధర్నా జరిగింది. బ్రాంచి మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ ఇఎస్ఐ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేసి, కార్మికులకు మంచి వైద్యం అందించాలని, మందులను ఇవ్వాలని కోరారు. 2022 కల్లా దేశమంతా ఇఎస్ఐ విస్తరించాలని నిర్ణయించినా, డాక్టర్లు, పరికరాలు, సిబ్బంది, మందుల లేమితో ఉన్నాయన్నారు. ఇఎస్ఐని బలోపేతం చేయకుండా ప్రైవేటీకరించాలని చూస్తోందన్నారు. నిపుణులతో భర్తీ చేసి ల్యాబ్ సౌకర్యాలను కల్పించాలన్నారు. ఆస్పత్రులకు

చెల్లించాల్సిన బిల్లులు రావడం లేదని ఇఎస్ఐ సౌకర్యం ఉన్నా రోగులను చేర్చుకోవడం లేదన్నారు. స్విమ్స్ ఆస్పత్రికి చెల్లించాల్సిన ఇఎస్ఐ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. డయాలసిస్ రోగులను ఆదుకోవాలన్నారు. నాయకులు టి.సుబ్రమణ్యం, పి.మునిరాజా, పి.బుజ్జి, రమేష్, రఘు, బాలయ్య, మల్లికార్జునరావు, రవి, శివ పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలను పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'స్పందన', 'జగనన్నకు చెబుదాం', నాడు-నేడు, హెల్త్, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, గ్రామ వార్డు సచివాలయాలు, గడప గడపకూ మన ప్రభుత్వం తదితర అంశాలపై కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై సిఎస్, సిఎం స్థాయిలో సమీక్ష, పర్యవేక్షణ జరుపుతున్నారని, దీనిని బాధ్యతతో నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలో కేసుల సంతృప్తి స్థాయి 65 శాతం ఉందన్నారు. ప్రతి అధికారి ఉదయం సాయంత్రం రెండుసార్లు జేకేసీ చెక్ చేసుకోవాలన్నారు. రీ ఓపెన్ కేసులు ఎక్కువగా తిరుపతి రూరల్‌లో ఉన్నాయన్నారు. ఎస్పీ మాట్లాడుతూ నేటివరకూ జేకేసీలో పోలీసు శాఖకు 77 ఫిర్యాదులు అందాయన్నారు. అందులో 58 సకాలంలో పరిష్కరించామన్నారు. యర్రావారిపాలెం, వడమాలపేట మండలాల్లో పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం నెమ్మదిగా జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ వెంకట్రావు, ఆర్డీఓ లు రామారావు, కిరణ్ కుమార్, చంద్రముని రణాల్, జిల్లా ప్లానింగ్ అధికారి అశోక్ కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి శేఖర్, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ ఈ విజయ కుమార్ పాల్గొన్నారు.

జగనన్న లేఔట్లకు మెటల్ సరఫరా చేయాలి : కలెక్టర్

జగనన్న లేఔట్లలో నిర్మితమవుతున్న గృహాలకు 20ఎంఎం, 40 ఎంఎం మెటల్‌ను అందుబాటు ధరకు సరఫరా చేయాలని క్రషర్‌యజమానులను ఆదేశించారు. క్రషర్ యజమానులు సహృదయంతో అందించాలని కోరారు. షెడ్యూల్ తయారు చేసుకుని టోకెన్ల ద్వారా చిందేపల్లి, సూరప్పకశం, జి.పాళెం, ఎం.కొత్తపల్లి, కల్లూరు తదితర లేఔట్లకు సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్‌రావు, మైనింగ్ ఏడీ ప్రకాష్‌కుమార్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సకాలంలో స్పందించాలి : కమిషనర్

తిరుపతి నగరంలోని ప్రజల నుండి స్పందన, 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల్లో వచ్చిన అర్జీలు, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాల్సిందేనని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఐఎఎస్ అధికారులకు స్పష్టం చేసారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం అన్ని విభాగాల అధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తూ కలెక్టరేట్ నుండి జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ వెంకటరమణారెడ్డికి తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నుండి పాల్గొన్న కమిషనర్ హరిత మాట్లాడుతూ నగర ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని బదులిచ్చారు.

వార్షిక రుణ ప్రణాళిక బుక్‌లెట్ విడుదల

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జిల్లాలో బ్యాంకర్ల నుండి అందుతున్న సహకారంతో 2022- 23 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలు, వ్యవసాయ రుణాలలో నిర్దేశించుకున్న లక్ష్యాల కన్నా ఎక్కువగా సాధించగలిగామని, ఈ ఆర్థిక సంవత్సరం 2023-24లోనూ బ్యాంకర్లందరూ సహకరించి సమిష్టిగా జిల్లాలోని పేదలకు, వ్యవసాయదారులకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు అంద జేయడంలో మంచి పురోగతి సాధించేలా సహకరించాలని కోరారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఎల్డీఎం సుభాష్, ఆర్బిఐ ఎల్డిఓ పూర్ణిమ, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు, బ్యాంకర్లతో సమావేశం జరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ రుణాలు 131 శాతం సాధించి రాష్ట్రంలో ముందంజలో ఉన్నామని అభినందించారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ప్రభుదర్, ఇండియన్ బ్యాంక్ డిజిఎం సెల్వరాజ్, జై కుమార్ రీజినల్ మేనేజర్ సప్తగిరి గ్రామీణ బ్యాంక్ పాల్గొన్నారు

సిఐటియు సంతాపం

తిరుపతి టౌన్ : తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ కార్యనిర్వహణాధికారి ఎంవీఎస్ ప్రసాద్ మతికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో తీవ్ర సంతాపం తెలియజేశారు. ఆయన సేవలను కొనియాడారు. ప్రసాద్ ఈఓగా ఉన్న సమయంలో ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారానికి తమకు ఎంతగానో సహకరించారని గుర్తు చేశారు. అనేకమంది ఉద్యోగులు పర్మినెంట్ కావటానికి ప్రసాద్ కషి తోడ్పడిందని, ఈ కారణంగా అనేకమంది ఉద్యోగులు పర్మినెంట్ అయి ప్రశాంతంగా జీవితం గడుపుతున్నారని గుర్తు చేశారు. ఆయన ఈఓగా ఉన్న సమయంలో పేదల పట్ల, ఉద్యోగులు, కార్మికులు, భక్తుల పట్ల అభిమానంతో వ్యవహరించే వారని అన్నారు. ఎంవీఎస్ ప్రసాద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

25 ఏళ్లుగా రోడ్డు పైనే...

మారని 'సంచార' బతుకులు

సంక్షేమానికి' ఆమడదూరం / అధికారులకు పట్టని వైనం / విద్యకు దూరంగా పిల్లలు

ప్రజాశక్తి - నాయుడుపేట

'ఇల్లు లేదు... వాకిలి లేదు.. 25 ఏళ్లుగా రోడ్డుపైనే బతుకు జీవనం.. సంచార బతుకులు.. పూసలు, దిష్టిబొమ్మలు, పిల్లల బుడిగలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.. అవి అమ్ముడుపోతేనే వారికి కడుపు నిండేది.. దాదాపు పది కుటుంబాలు ఉన్నాయి. 60మంది పైనే ఉంటారు. వీరిలో పిల్లలు 35-40 మంది ఉంటారు.. వీరంతా బడిఈడు పిల్లలే. అయితే బడిబయటే ఉంటారు.. రెండు దశాబ్దాలకు పైగా వీరు నాయుడుపేట నడిబొడ్డున బస్టాండ్‌కు వెళ్లేదారిలో రోడ్డుపై కాపురాలు ఉంటుంటే అధికారులకు పట్టదు. పాలకులు కేవలం 'ఓటు'కు మాత్రమే ఉపయోగించుకుంటారు.. సంక్షేమం వీరి దరిచేరదు. ప్రభుత్వ పథకాలు ఎలా ఉంటాయో తెలియదు. వడగాల్పులొచ్చినా, వానొచ్చినా, వరదొచ్చినా వీరు రోడ్డుపైనే బతుకు జీవనం సాగిస్తున్నారు..' మండు వేసవిలో 45 డిగ్రీల వడగాల్పుల్లో ఉదయం 11 గంటలు దాటిందంటే ఇళ్లల్లో ఏసీలు ఆన్ అవుతున్నాయి. ఇంటినుంచి బయటకు వెళ్లడానికి సామాన్యుడు సైతం జంకే పరిస్థితి. అయితే సంచార జాతుల బతుకులు (నక్కలోళ్లు) మాత్రం మారడం లేదు. రోడ్డుపైనే జీవించే వీరికి ఎపుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయంతోనే వీరు బతికేస్తున్నారు. 'జగనన్నకు చెప్పుకుందాం' అన్నా అదొక అవకాశం ఉందనీ తెలియని నిరక్షరాస్యులు.

నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లేదారిలో రెండు దశాబ్దాలుగా వీరు ఉంటున్నా అటు అధికారులకు గాని, ఇటు పాలకులకు గాని పట్టని పరిస్థితి. కేవలం ఓటుకు మాత్రమే వీరు అర్హులు. సంక్షేమానికి ఆమడదూరంలో ఉంటున్నారు. పథకాలేవీ వారికి వర్తించే పరిస్థితి లేదు. వారికోసం వాలంటీర్లూ ఉండరు. ఈ విషయమై నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావును వివరణ కోరగా వాళ్లకు మరోచోట స్థలాన్ని చూపిస్తున్నామని చెబుతున్నారే తప్ప 'జగనన్న కాలనీల్లో వారికి ఎందుకు చోటు లేదు' అన్నది తెలియదు. గత మున్సిపల్ కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వారిని వేరేచోటుకు తరలించడానికి స్థలాన్ని కేటాయించారు. అయితే కొంతమంది రాజకీయ నాయకులు సంచార జాతులవారిని రాజకీయాలకు అడ్డు పెట్టుకుని వీళ్ల అమాయకత్వంతో గొడవలు సృష్టిస్తూ వాళ్లను అక్కడనుంచి కదలనీయడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. గతంలో రోడ్డు పక్కన ఉండే వీరు యజమాని కోర్టుకెక్కి స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంతో రోడ్డుపైకి వచ్చారు. ప్రస్తుతం వీరు 'రాజకీయ పావులుగా' ఉన్నారే తప్ప వీరికంటూ 'శాశ్వత సంక్షేమ పథకాలు' లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా మానవీయ కోణంలో అధికారులు ఆలోచించి వారి వ్యాపారానికి అనువైన స్థలంలో వారికి శాశ్వత జాగా చూపించి, ఇళ్లు, షాపులు కట్టి ఇవ్వాల్సి ఉంది.

విద్య -3

'లక్' ఉంటేనే 'సీటు'

అనాథలు, హెచ్ఐవి బాధితులకు 5 శాతం
ఎస్సీ- ఎస్టీలకు 14 , బీసీ- ఓబీసీలకు 6 శాతం
సెలక్షన్ విధానంలో నిర్దిష్టతలపై అస్పష్టత
'ప్రైవేటులో ఉచిత విద్య'పై నీలినీడలు

ప్రజాశక్తి- తిరుపతి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ స్కూళ్లలోని 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ప్రకటించారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్లో అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చంటూ ప్రకటించారు. అయితే విద్యార్థుల ఎంపిక మాత్రం లాటరీలో ' అదృష్టం' వరించాల్సిందేనని అధికారులు పేర్కొంటుండటంలో మెలిక ఏంటని విద్యార్థి సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. అలగే సెలక్షన్ విధానంపైనా, నిర్దిష్టతలపైనా అస్పష్టతగా ఉందని అధికారులే పేర్కొంటున్నారు. స్కూల్ ప్రారంభంలోనే జాబితాను ప్రకటించడానికి కసరత్తు చేస్తున్నామంటూ చెబుతున్నా...తాజా ఉత్తర్వులు వచ్చే వరకూ ప్రైవేటులో ఉచితం విద్యకోసం ' అదృష్టవంతులు' నిరీక్షించక తప్పదేమో!.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అమలు అవుతున్న విద్యావిధానంపై గురిపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేటు విద్యాసంస్థలో ' లాటరీలో అదృష్టవంతులకే' ఉచిత విద్యను అందించాలని భావించారు. పాఠశాలలో అడ్మిషన్ల కోసం డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజులు లేకుండా ఉచిత విద్యను అందించాలని సంకల్పించారు. అందులో భాగంగానే విద్యాశాఖ అధికారులకూ ఫిబ్రవరి 26 నే ఆదేశాలనూ జారీ చేసినట్లు తెలుస్తోంది. అందులో ప్రైవేటు విద్యాసంస్థల్లో మొత్తం 25 శాతం ఉచిత విద్యను అమలు చేయాలని ఆదేశించారు. అందులో అనాథలకు, హెచ్ఐవి బాధితులు- వారి పిల్లలకు 5 శాతం కేటాయించారు. అలాగే ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం ఇవ్వాలని పేర్కొన్నారు. మిగిలిన 6 శాతాన్ని బీసీ, ఓబీసీలకూ సర్దుబాటు చేశారు. ఈ ఉచిత సీట్లకు గాను ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అయితే లాటరీలో రెండు విడుతలుగా అర్హులను ఎంపికచేసే బాధ్యతను ఆయా జిల్లాల అధికారులకు అప్పగించినట్లు తెలుస్తోంది. అయితే ఆ ఎంపిక చేసే కమిటీ విధివిధానాలు, ఎంపికపై నిర్దిష్టమైన విధివిధానాలపై స్పష్టతకొరవడినట్లు విద్యాశాఖ అధికారులే పేర్కొంటున్నారు. జూన్ మొదట్లోనే 2023-24 విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో సాధ్యమైనంత త్వరలో తాజాగా నిర్దిష్టమైన విధివిధానాలను ప్రకటించడమే కాకుండా మెరిట్, అర్హత ప్రాతిపదికగా సీట్లను భర్తీ చేయాలని విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

గిరిజన కాలనీల్లో విద్యపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఉదయం గిరిజన కాలనీలోని పిల్లల తల్లిదండ్రులకు చదువుపై అవగాహన కల్పించారు. పాఠశాలలో చదువుతూ మధ్యలో నిలిచిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను మళ్లీ బడికి పంపాలని కోరారు. ఉపాధ్యాయులు యువశ్రీ మురళీ, నాదెండ్ల మురళీ, వ్యాయామ ఉపాధ్యాయులు దాసు పాల్గొన్నారు.

మహానాడు బహిరంగ సభ విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రతి ఏడాది నిర్వహిస్తున్న మహానాడుతో పాటు ఈ సంవత్సరం ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు సందర్భంగా రాజమండ్రిలో ఈనెల 28న జరుగనున్న మహానాడు భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులకు నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలన నుండి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు విముక్తి కల్పించి, యువత, మహిళలు, రైతుల అభివద్ధి కోసం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి చేయడానికి చంద్రబాబు అద్భుత ప్రకటన చేయబోతున్నారని తెలిపారు. ఈ సంవత్సరం జరిగే చారిత్రక మహానాడు వైసీపీ పాలనపై ప్రజల నాడిని పసిగట్టే సాధనంగా ఉంటుందని.. నగరి నియోజకవర్గంలోని అన్ని మండలాల తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర, పార్లమెంటరీ స్థాయిల్లోని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల నమోదు చేసుకుని మహానాడు ప్రతినిధుల సభ జరుగుతుందని, ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

పుత్తూరు టౌన్: తడుకు, శిరుగురాజుపాళెం పంచాయతీల టీడీపీ నాయకులు ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా రాజమహేంద్రవరంలో జుఉజరిగే మహానాడుకు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. తడుకు సర్పంచ్ పాశం వెంకటేష్, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు, నగరి నియోజకవర్గ బీసీ సెల్ ప్రధానకార్యదర్శి కరుణాయాదవ్, తెలుగుదేశం కార్యకర్తలు క్రిష్ట, గోపి, బాలాజీ, కేశవులు వెళ్లారు.

దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల టీడీపీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం మహానాడుకు నాయకులు తరలి వెళ్లారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాజమండ్రిలో 27, 28 తేదీల్లో జరగనున్న మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు దొరవారిసత్రం మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. ప్రధాన కార్యదర్శి పల్లంపర్తి మనోహర్‌రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు గోను జకరయ్య, కిషోర్ నాయుడు, మాజీ బీసీ సెల్ అధ్యక్షుడు వంకా రాధయ్య, బాబునాయుడు, రవినాయుడు, ప్రసాద్‌నాయుడు, రవీంద్రనాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, యువరాజ్ నాయుడు, దార్ల మణి, వెంకటయ్య తదితరులు బయలుదేరి వెళ్లారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పి.ఎస్.ఆర్ ట్రస్టు దాతత్వంతో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు చేతి గడియారాలు, బంగారు ఉంగరాలను ప్రోత్సాహక బహుమతులుగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ దేవసేనమ్మ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ ట్రస్టుతో ప్రతి సంవత్సరం ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మార్కులు సాధించారని.. ఇలాగే బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వేగూరు రాజేంద్ర, శ్రీనివాసులు, రావూఫ్, పురుషోత్తం, గోపాల్ యాదవ్, రామ్మోహన్ రావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 30 నుంచి జూన్ 9వ తేదీ వరకు గూడూరు పట్టణంలోని రాజవీధిలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయ పాలకమండలి ఛైర్మన్ శ్రీకంటి రామ్మోహన్ రావు తెలిపారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని రాజావీధిలో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఈవో నవీన్ కుమార్, పాలకమండలి ఛైర్మన్ శ్రీ కంటి రామ్మోహన్‌రావు సభ్యులు విడుదల చేశారు. సమావేశంలో సభ్యులు అన్నం రఘురామయ్య, పాదర్తి సుప్రజా కష్ణయ్య, వాచస్పతి, సురేంద్ర, పాదర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు తగ్గేవరకు మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి-గూడూరు: గత పది రోజులుగా గూడూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టేవరకు చలివేంద్రం కొనసాగిస్తామని.. రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ అధ్యక్షులు ధనుంజయరెడ్డి తెలిపారు. మజ్జిగ చలివేంద్రానికి దాతగా డాక్టర్ పి.వి.కృష్ణారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో వాసు గౌడ్, సిద్ధారెడ్డి, రాజేంద్రరెడ్డి, బలరాం రెడ్డి, సేగు శ్రీను, మౌర్యతేజ పాల్గొన్నారు.

కమ్మకొత్తూరు.. సమస్యలమయం..!

ఎటుచూసినా మురుగునీరు
రోగాల బారిన ప్రజలు
పట్టించుకోని అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అంటూ పలు కార్యక్రమాలు చేపడుతున్నా తూతూమంత్రంగా గ్రామాల్లో అమలు చేస్తున్నారు. గ్రామాల్లో నివసించే ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందనే నాయకుల మాటలు ఉత్తుత్తి మూటలుగానే కనిపిస్తున్నాయి. కమ్మకుత్తూరు పంచాయతీలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 48 పంచాయతీలు ఉన్నాయి. ఈ కమ్మకొత్తూరు పంచాయతీ శ్రీకాళహస్తి పట్టణానికి కూతవేటు దూరంలో ఉంది. పంచాయతీలో కమ్మకొత్తూరు, హరిజనవాడ, అరుంధతి వాడ, పెనుబాక గ్రామం, పెనుబాక హరిజనవాడ లో మొత్తం 281 కుటుంబాలు నివసిస్తున్నారు. కమ్మ కొత్తూరు గ్రామం, హరిజనవాడ, అరుంధతి వాడలో సైడు కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలో నుంచి వచ్చే మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల ముందే నిలిచి తీవ్ర దుర్గంధం వెదజల్లడమే కాకుండా నానాటికి దోమలు ఉత్పత్తి చెంది వాటితో రోగాల బారిన పడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. అలాగే గ్రామంలోని ప్రజలు తాగడానికి మంచినీరు కావాలంటే ఊరు మొదట్లో ఉన్న ఒకే ఒక్క చేతి బోరుపైనే ఆధార పడాల్సి ఉంది. ఊరిలో చేతి బోర్లు ఉన్నప్పటికీ ఏ ఒక్క బోరులో నుంచి వచ్చే నీరు తాగడానికి పనికిరాని ఉప్పు నీళ్లు వస్తున్నాయి. బోరు దగ్గరికి వెళ్లి నీళ్ల తెచ్చుకుంటున్నామని గ్రామ ప్రజలు అంటున్నారు. గ్రామంలో ఒకటికి రెండు వాటర్ ట్యాంకులు ఉన్నప్పటికీ ఈ ట్యాంకులు పనిచేసి చాలాకాలం అయిందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలాగే పెనుబాక గ్రామంలో ఎప్పుడో నిర్మించిన వాటర్ ట్యాంక్ ఉంది. ఈ వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరడంతో ఏ సమయంలో కుప్పకూలి ప్రజల ప్రాణాలపై తెస్తుందేమోనని గ్రామ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అలాగే పెనుబాక గ్రామానికి నీటి సౌకర్యం కల్పించడానికి అధికారులు కమ్మ కొత్తూరు నుంచి పెనుబాకు వచ్చే మార్గమధ్యంలో ఒక సబ్ మోటర్‌ను ఏర్పాటు చేయడానికి విద్యుత్ కోసం పెనుబాక గ్రామం నుంచి పొలాల మధ్యలో విద్యుత్ స్తంభాలకు బదులుగా చేతికందే ఎత్తులో కర్రలు నాటి వాటితో విద్యుత్ తీగలను కనెక్షన్ ఇచ్చారు. ఇక్కడ స్టార్టర్‌ను ఒక విద్యుత్ స్తంభానికి భూమి మట్టానికి అమర్చడం.. అలాగే దీని పక్కనే భూమిపై విద్యుత్ లైన్ల లింకులను ఏర్పాటు చేయడం జరిగింది. పొరపాటున ఏ ఒక్కరైనా విద్యుత్ లింకులపై కాలు పెడితే కానరాని లోకాలకు చేరుకుంటారు. ఇంత పెద్ద సమస్య కళ్లముందే కనబడుతున్న అధికారులకు గాని.. ప్రజా ప్రతినిధులకు గాని చీమకుట్టినట్లు కనబడటం లేదని గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కమ్మకొత్తూరు పంచాయతీలో ఉన్న సమస్యల వలయాన్ని ఛేదించాలని కోరుతున్నారు.

తాగునీటికి తప్పని కష్టాలు

గ్రామంలో మంచి నీటి చేతిబోర్లు ఉన్నప్పటికీ ఊరి మొదట్లో ఉన్న చేతి బోరులో మాత్రమే తాగడానికి మంచి నీరు వస్తుంది. మిగిలిన బోర్లలో నీరు తాగడానికి పనికిరాదు. అంత దూరం వెళ్లి రోజూ నీరు తెచ్చుకోవడం కష్టంగా ఉంది. మంచినీరు అందించే తాగునీటి బోర్లను అధికారులు ఏర్పాటు చేయాలి.

- రేణుకమ్మ, కమ్మకొత్తూరు అరుంధతి వాడ

వెంటనే చర్యలు తీసుకుంటాం

కమ్మ కొత్తూరు పంచాయతీలో ఉన్న సమస్యలు మా దష్టికి రాలేదు. వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి పంచాయతీలోని సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతాం.

- ప్రేమ్ రాజ్ కుమార్, ఎంపీడీవో, శ్రీకాళహస్తి

28న యూపీఎస్సీ ప్రిలిమ్స్ పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి-క్యాంపస్: ఈనెల 28న యూపీఎస్సీ ప్రిలిమ్స్ 2023 పరీక్షలను పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షకు విధులు కేటాయించబడిన జిల్లాస్థాయి అధికారులతో, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, తహశీల్దార్లు, అధికారులతో పరీక్షల నిర్వహణపై రాష్ట్ర అబ్జర్వర్ సమీక్షించారు. రాష్ట్ర అబ్జర్వర్ మాట్లాడుతూ సహాయ సమన్వయ అధికారులు ప్రశ్న పత్రాలను సకాలంలో భద్రంగా పరీక్ష కేంద్రాలకు చేర్చడం జరగాలని, జవాబు పత్రాలను ప్రధాన పోస్ట్ ఆఫీస్‌కు ఎస్కార్ట్ తో వెళ్లి అందచేయాలని ఆదేశించారు. జిల్లాలో 6333 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని.. పరీక్షల నిర్వహణ ఉదయం 9.30 నుండి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 4.30 వరకు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఏడీ సర్వే జయరాజ్, డిపిఓ రాజశేఖర్ రెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అధికారి ప్రసాదరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి చీఫ్ సూపర్డెంట్లు, తాసిల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

తిరుపతిలో నేచురల్ సీఎన్‌జీ గ్యాస్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఏజీ అండ్ పీ ప్రథామ్ సంస్థ రెండు సీఎన్ జీ యూనిట్లు ప్రారంభించింది. ఒకటి తిరుపతి మహతి ఆడిటోరియం రోడ్డులోని హెచ్పీసీఎల్ ఆటో కేర్ వద్ద, మరొకటి గాజులమండ్యం వద్ద ప్రారంభించామని నిర్వాహకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెరుగుతున్న సిఎన్ జీ గ్యాస్ అవసరాల దష్ట్యా యూనిట్లను ప్రారంభిస్తున్నట్లు ఏజీఅండ్ పీ ప్రథామ్ రీజనల్ హెడ్ చిరాగ్ కే భన్వాడియా మీడియాకు తెలిపారు. గాజులమండ్యంలోని ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలో వాణిజ్య అవసరాలకు, ఇంకా గహావసరాలకు పైప్‌తో గ్యాస్ పంపిణీ చేయడానికి ప్రత్యేక కార్యచరణ చేస్తున్నామన్నారు. ఈ రెండు అవుట్ లెట్లలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలకు గ్యాస్ ఫిల్లింగ్ చేస్తామన్నారు. ఈ సీఎన్ జీ గ్యాస్ గాలికన్నా తేలికైనది కావడంతో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉండదన్నారు.

శ్రీకాళహస్తి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా లోకేష్

ప్రజాశక్తి- తొట్టంబేడు: కడపకు చెందిన పొలకల లోకేష్ శ్రీకాళహస్తి రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా ఈనెల 22న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. అటవీ భూములు కాపాడుతానని.. ఖాళీ ప్రదేశాలలో ఎర్రచందనం మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన మిషన్ లైఫ్ ఈవెంట్స్ కార్యక్రమంలో భాగంగా రోజూ మూడు బీట్ల కెళ్లి కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. అటవీ ప్రాంత ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

నిర్మలరేఖకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యావిభాగం పరిశోధక విద్యార్థిని మల్లెల నిర్మలరేఖకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. విశ్వవిద్యాలయ విద్యా విభాగం ఆచార్యులు టంగుటూరి శిరీష మార్గదర్శకత్వంలో " ది ఇంపాక్ట్ అఫ్ యోగిక్ ప్రాక్టీస్ ఆన్ టెస్ట్ యాంగ్జైటీ అండ్ అచీవ్మెంట్ మోటివేషన్ ఆఫ్ హియరింగ్ అండ్ హియరింగ్ ఇంపైర్డ్ స్టూడెంట్స్ " అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకుగాను ఆమెకు విద్యావిభాగంలో డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. అవార్డు లభించడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థినులు ఆమెకు అభినందనలు తెలిపారు.

టిఎస్ ఎంసెట్ ఫలితాల్లో
నారాయణ ప్రభంజనం

ప్రజాశక్తి-తిరుపతి సిటి : తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఎంసెట్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నారాయణ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారని నారాయణ విద్యాసంస్థల డిజిఎం కొండలరావు తెలిపారు. స్థానిక ఎంఆర్ పల్లిలోని నారాయణ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంసెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఇంజినీరింగ్ విభాగంలో బాబు సుజనరెడ్డి 19వ స్థానం, భువనచంద్ర 22, శశాంక్‌రెడ్డి 37, వింధ్య 87, మిఖిల్ 108, మనోజ్ 160, కృతి 240, ప్రేమ్ చంద్రారెడ్డి 285, తనుష్ 297, ముని ప్రణతి 310, జస్విన్ రెడ్డి 513, హర్షిత 689, వైష్ణవి 993, ప్రభాష్1010, అగ్రికల్చర్ విభాగంలో కార్తికేయ రాయల్ 176, దేవాదారున్ 320, చందనజ్యోతి 361, ప్రవీణ్ కుమార్ 378, పద్మశ్రీ 379, సాయి సమిత్‌రెడ్డి 688, చిట్టి రేచల్ 936 ర్యాంకులను కైవాసం చేసుకున్నారని తెలిపారు. మొత్తం మీద మొదటి వందలో నాలుగు, మొదటి వెయ్యిలో 19 ర్యాంకులతో తమ విద్యార్థులు సత్తా చాటారన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను డీన్లు, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

పాఠశాలలో విద్యాకానుకల పరిశీలన

ప్రజాశక్తి-గూడూరు రూరల్ : విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు అవసరమైన విద్యాకానుకలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చేరిన జగనన్న విద్యా కానుక,విద్యాసామగ్రిని గూడూరు ఆర్డీవో, విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ విద్యాసంస్కరణలో భాగంగా నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరచడంతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శివ ప్రకాష్ రెడ్డి, ఎంఈవో దేవకుమార్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావూఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ కాలువ స్థలం ఆక్రమణ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం రవాణాశాఖ కార్యాలయం కూడలి నుంచి శెట్టిపల్లికి వెళ్లే మార్గంలోని చెన్నాయి గుంటకు వెళ్లే ఇరిగేషన్ కాలువ దురాక్రమణకు గురౌతోంది. గతంలో మట్టితో కాలువ స్థలాన్ని పూడ్చుతుండటంతో స్థానిక విల్లేజ్ రెవిన్యూ అధికారి భూపతి ఆచారి అడ్డుకొన్నారు. స్థలానికి సంబంధించి సరైన ధ్రువపత్రాలు చూపాలని ఆదేశించారు. రెవిన్యూ విభాగ హెచ్చరికలు పట్టించుకోకుండా మళ్లీ కాలువ ఆక్రమణకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ఆక్రమాదారులు రెవిన్యూ అధికారుల కళ్లు కప్పి క్రమేపి కాలువను ఆక్రమిస్తూనే ఉన్నారు. దీనిపై ప్రజాశక్తి అర్బన్ తాహశీల్దార్ వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లగా ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

బాబోయ్ కరెంటు కోతలు
నాయుడుపేటలో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి-నాయుడుపేట: రోజురోజుకీ పెరుగుతున్న బాణుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ తాకిడికి ప్రజలు బయట తిరగలేక ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్తు కోతలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నవాళ్లకు కరెంట్ పోయినా ఇన్వర్టర్లతో కొంత సేదతీరే అవకాశముంటుంది. అయితే పేదవాళ్లకు ఫ్యాన్ తిరగాలన్నా కరెంట్ ఉంటేనే. ఎండ తాకిడికి పేదలు కాసేపు సేద తీరాలంటే కరెంట్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాయుడుపేటలో కరెంట్ కష్టాలు అధికంగా ఉన్నాయి. గంట గంటకు పోతున్న కరెంట్‌తో ఇబ్బందులు పడుతున్నారు. అర్ధరాత్రి సైతం కరెంట్ ఎప్పుడు పడితే అప్పుడు తీసేస్తున్నారు. పగలైతే చెప్పనక్కరలేదు. కారణం అడిగితే లోడ్ ఎక్కువై ట్రాన్స్‌ఫార్మర్ కాలిందని.. మరమ్మతులు చేస్తున్నామంటూ ప్రతిసారీ ఇదే సమాధానం. ఒక్క నెల కరెంట్ బిల్లు కట్టడం లేటయితే ఫీజులు పీకేసే సిబ్బందికి ఇలా ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత లేదా? అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా విద్యుత్‌శాఖ విధానంలో మార్పులు రావాలని కోరుకుంటున్నారు.

పంట కాలువల్లో.. డెయిరీ వ్యర్థాలు

● దెబ్బతింటున్న పంటలసాగు ● దుర్వాసన, దోమలతో స్థానికుల అవస్థలు ● పట్టించుకోని చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పిచ్చాటూరు: స్థానిక శ్రీకాళహస్తి రోడ్డులోని ఓ ప్రైవేటు పాల డెయిరీ వికతి చేష్టలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. డెయిరీ నుంచి వెలువడే వ్యర్థాలను ఇరిగేషన్ కాలువలోకి నేరుగా వదిలేస్తున్నారు. ఈ కాలువ పిచ్చాటూరు గ్రామంలోని నివాసాల మధ్యలో ప్రవేశించి పొలాల్లోకి వెళుతుంది. కాలువలో ప్రవహించే నీరు తెల్లగా పాలు కలిసి ప్రవహిస్తుండటంతో తీవ్ర దుర్వాసనతో వెదజల్లుతోంది. దుర్వాసన భరించలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తమ పంటలు, తమ భూములు సాగుకు నోచుకోవడం లేదని.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పాల డెయిరీ పూర్తి వ్యర్థాలను యాజమాన్యం కాలువలో వదిలేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే చర్యలు చేపట్టాలని, లేకుంటే రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తామన్నారు. ఇకపై డెయిరీ వ్యర్థ నీరు కాలువలో ప్రవహిస్తే పాల డెయిరీని ముట్టడిస్తామని రైతులు హెచ్చరించారు.

డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

పిచ్చాటూరులోని పాల డెయిరీ యాజమాన్యం నిర్లక్ష్యంగా తన పరిశ్రమలోని వ్యర్థాలను పంట కాలువల్లో వదులుతుండటం దారుణం. యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. రైతుల పంటలు దెబ్బతినడమే కా కుండా పండే ధాన్యం విషపూరితం అవుతాయి. ప్రజల ఆహార ధాన్యాల్లో విషపదార్థాలు చేరి ప్రజలకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్న పాల డెయిరీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

- జనార్ధన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు



యాజమాన్యానికి నోటీసులు జారీ చేశాం

పాల డెయిరీ యాజమాన్యం వ్యర్థాలను వ్యవసాయ పంట పొలాలకు వెళ్లే కాలువల్లో వదిలేస్తున్నారని తెలియడంతో వెంటనే యాజమాన్యానికి నోటీసులు జారీ చేశాం. వ్యర్థ పదార్థాలను పంట పొలాలు, కాలువలలో వదిలితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం.

- శ్రీనివాసులు, ఎంపీడీవో, పిచ్చాటూరు